RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 120 | మే 27 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 120 | May 27 Wednesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ఎమ్మార్వో 2

# రాష్ట్రవ్యాప్త సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

## జూన్ 2 నుంచి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2వ తేదీ నుండి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభల నుండి జిల్లా స్థాయి వరకు ఇప్పటివరకు జరిగిన ప్రగతిని అంచనా వేసిన మంత్రుల బృందం, రాబోయే పది రోజుల ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ వారోత్సవాలు, రోడ్డు భద్రతపై అవగాహన, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పునర్వినియోగ ఇంధన (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల శంకుస్థాపనలు వంటి విభిన్న ప్రజా ఉపయోగకర కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎక్కడా చిన్న లోపం కూడా లేకుండా ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

➢ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణలో ఎబోలా భయాలు వద్దు

### సర్వసన్నద్ధంగా వైద్య ఆరోగ్య శాఖ



**హైదరాబాద్ జనసంఘర్షణ**
ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా ఎబోలా పాజిటివ్ కేసులు నమోదు కాలేదని, అలాగే ఈ వ్యాధికి సంబంధించిన ప్రాథమిక లక్షణాలు ఉన్న వ్యక్తులెవరినీ ఇప్పటివరకు గుర్తించలేదని ఆయన వెల్లడించారు. అయినప్పటికీ, ప్రజారోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుజాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా 'హై అలర్ట్' ప్రకటించిందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) వద్ద నిఘాను తీవ్రం చేసి, అంతర్జాతీయ ప్రయాణికులకు కట్టుదిట్టమైన స్క్రీనింగ్ పరీక్షలతో పాటు థర్మల్ స్కాన్ ప్రోటోకాల్స్‌ను అమల్లోకి తెచ్చినట్లు వివరించారు. ఎబోలా తీవ్రత ఎక్కువగా ఉన్న

➢ మిగతా 2వ పేజిలో..

## అజ్ఞాతంలో మరో 47 మంది మావోయిస్టులు

### లొంగిపోవాలని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపు



**హైదరాబాద్ జనసంఘర్షణ**
మావోయిస్టు పార్టీలో సుమారు నాలుగున్నర దశాబ్దాల పాటు సుదీర్ఘంగా పనిచేసిన కీలక నేత పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ఆయన భార్య ధనమ్మ మే 12వ తేదీన పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వీరిద్దరిని అధికారికంగా ప్రవేశపెట్టారు.

➢ మిగతా 2వ పేజిలో..

## వాహనదారులకు కేంద్రం షాక్

### ఇంధన ధరల మోత.. 11 రోజుల్లో నాలుగోసారి పెంపు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశంలో వాహనదారులపై ఇంధన ధరల భారం మరింత పెరిగింది. సామాన్యుడిపై ఆర్థిక భారాన్ని మోపుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. ఈసారి కిలో సీఎన్‌జీపై రూ. 2 అదనంగా పెంచడంతో, పెరిగిన ధరలు తక్షణమే అమలులోకి వచ్చాయి. ఈ తాజా నిర్ణయంతో దేశ రాజధాని ఢిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ. 81.09 నుండి రూ. 83.09కి చేరుకుంది. గడిచిన 11 రోజుల్లోనే సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది వరుసగా నాలుగోసారి కావడం గమనార్హం. గత మే 15వ తేదీన మొదటగా కిలోకు రూ. 2 పెంచిన కేంద్రం, ఆ తర్వాత రెండు విడతల్లో ఒక్కో రూపాయి చొప్పున పెంచుతూ పోయింది. ఇప్పుడు తాజాగా మరో రూ. 2 పెంచడంతో మొత్తంగా ఈ స్వల్ప వ్యవధిలోనే రూ. 7 వరకు అదనపు భారం పడింది. దీనివల్ల నిత్యం ఇంధనాన్ని నమ్ముకుని జీవించే ఆటోలు, క్యాబ్‌లు, రవాణా రంగ కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇంధన ధరలను పెంచబోమంటూ హామీలు ఇచ్చినప్పటికీ, ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే వరుసగా ధరలు పెంచుకుంటూ పోతుండటంపై వినియోగదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎన్‌జీ మాత్రమే

➢ మిగతా 2వ పేజిలో..

## తూర్పుగోదావరి జిల్లాలో ఘోర ప్రమాదం

### విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురు మృతి

**కాకినాడ జనసంఘర్షణ**
తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామం శివారులో ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను

➢ మిగతా 2వ పేజిలో..

## ఒడిశాలో ఘోర ప్రమాదం

### సెప్టిక్ ట్యాంక్ కూలి ఆరుగురు దుర్మరణం

**భువనేశ్వర్ జనసంఘర్షణ**
ఒడిశా రాష్ట్రంలో అత్యంత విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. కళహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఒక సెప్టిక్ ట్యాంక్ ప్రమాదవశాత్తూ కూలిపోవడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లాలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్‌కు సంబంధించిన సెంట్రింగ్ సామాగ్రిని తొలగించడానికి ఒక మేస్త్రి తొలుత లోపలికి దిగాడు. అయితే, అతను పని చేస్తున్న సమయంలో ఆ నిర్మాణం ఒక్కసారిగా కూలిపోవడంతో మేస్త్రి అందులోనే చిక్కుకుపోయాడు. ప్రమాదంలో చిక్కుకున్న అతడిని రక్షించే ప్రయత్నంలో మరో

➢ మిగతా 2వ పేజిలో..

## ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరిక



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య సాగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారింది. తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను దులుకోవాలంటూ అమెరికా పెడుతున్న నిబంధనలకు ఇరాన్ మొదటో

➢ మిగతా 2వ పేజిలో..

## రాష్ట్రవ్యాప్త సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

➢ **మొదటి పేజి తరువాయి ...** ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పూర్తిస్థాయి సామాజిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ఈ సామూహిక బీమా పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లూ కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ (ఇంటింటి సర్వే) చేపట్టాలని, పొరపాటున ఎవరైనా ఈ సర్వేలో మిగిలిపోతే వారి కోసం ప్రత్యేకంగా స్పెషల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ బీమా పథకం కోసం ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేస్తున్నట్లు, సర్వే విజయవంతంగా పూర్తయిన ఇళ్లను గుర్తించడానికి ఆయా ఇళ్ల గోడలపై ఈ ప్రత్యేక లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నట్లు కమిటీ పేర్కొంది. ఈ మేరకు అన్ని విభాగాలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అధికారులను కోరారు. ఈ కీలక సమావేశంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానియా, గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఎబోలా
# భయాలు వద్దు

➢ **మొదటి పేజి తరువాయి ...** కాంగో (డీఆర్సీ), ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామని, దీనికోసం ఎయిర్‌పోర్టులో వైద్యులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో కూడిన ప్రత్యేక వైద్య బృందాలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుండి సుమారు 58 మంది ప్రయాణికులు హైదరాబాద్ చేరుకున్నారని, అయితే వారిలో ఎవరికీ వ్యాధి లక్షణాలు లేవని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ, ముందస్తు జాగ్రత్త చర్యగా వారందరినీ 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి, జిల్లా నిఘా బృందాల ద్వారా వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఎవరికైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే, వారిని తక్షణమే తరలించేందుకు వీలుగా ఎయిర్‌పోర్టులో 108 అంబులెన్స్‌లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచామని, అలాగే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేకంగా 10 పడకల ఐసోలేషన్ వార్డును సర్వసన్నద్ధం చేశామని వెల్లడించారు. ఈ నివారణ చర్యల పర్యవేక్షణకు జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సునీల్ కుమార్‌ను నోడల్ అధికారిగా నియమించామని, అనుమానిత శాంపిల్స్‌ను త్వరితగతిన పరీక్షించడానికి మహారాష్ట్రలోని పుణెలో గల 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' (ఎన్ఐవీ)కి పంపేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్‌ను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పక్కాగా అమలు చేయాలని, ఈ విషయంలో అధికారుల వైపు నుంచి ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మంత్రి దామోదర రాజనర్సింహ గట్టిగా హెచ్చరించారు.

## రైతులకు మేలు చేసేలా 'ఫార్మ్ టు హోమ్'

➢ **మొదటి పేజి తరువాయి ...** యడవోలు గ్రామం సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. అలాగే వ్యవసాయ రంగంలో అత్యాధునిక పరిశోధనల కోసం ఉద్దేశించిన 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' సంస్థకు రాబోయే జూలై నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు స్పష్టం చేశారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణ దశలో ఉన్న 'ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్' పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసిందని, ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను అంతర్జాతీయ ప్రమాణాలతో పరీక్షించడానికి వీలవుతుందని తెలిపారు. వీటితో పాటు ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు కొత్తగా తీసుకునే ఆక్వా కనెక్షన్లకు కూడా విద్యుత్ సబ్సిడీని వర్తింపజేయనున్నట్లు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. సముద్రంపై వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత, ఉపాధిని మెరుగుపరిచేందుకు వీలుగా 200 అత్యాధునిక మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెబుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే రైతులు, మత్స్యకారుల సమగ్ర శ్రేయస్సుకు తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు.

## ఒడిశాలో ఘోర ప్రమాదం

➢ **మొదటి పేజి తరువాయి ...** లోపల ఊపిరాడకపోవడం (సఫోకేషన్) వల్ల ట్యాంక్‌లోకి వెళ్లిన ఆ ఐదుగురు కూడా అక్కడికక్కడే తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాదాన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే స్పందించి, తీవ్ర శ్రమకోర్చి లోపల ఉన్న ఆరుగురిని బయటకు వెలికితీశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. అయితే, వారు ఆసుపత్రికి చేరుకునే లోపే మరణించారని అక్కడి వైద్యులు ప్రాథమిక పరీక్షల అనంతరం ధ్రువీకరించారు. ఈ ఘోర దుర్ఘటనలో మరణించిన వారిలో ముగ్గురు మేస్త్రీలు, ఒక కూలీతో పాటు ఆ ఇంటి యజమాని, ఆయన కుమారుడు కూడా ఉండటం స్థానికంగా తీవ్ర శోకాన్ని నింపింది. ఈ ఊపిరాడక జరిగిన మరణాలపై స్థానిక పోలీసులు కేసు

## మరో 47 మంది మావోయిస్టులు

➢ **మొదటి పేజి తరువాయి ...** ప్రభుత్వ పునరావాస పథకంలో భాగంగా నరహరికి 25 లక్షల రూపాయలు, ధనమ్మకు 20 లక్షల రూపాయల చొప్పున రివార్డు మొత్తానికి సంబంధించిన చెక్కులను డీజీపీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంకా 47 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో కొనసాగుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయని తెలిపారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం నలుగురు మాత్రమే ఉన్నారని, అందులో తెలంగాణకు చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒక్కరు కాగా.. మిగిలిన వారిలో ఛత్తీస్‌గఢ్ నుంచి 15 మంది, జార్ఖండ్ నుంచి 13 మంది, ఒడిశా నుంచి 15 మంది ఉన్నారని వివరించారు.

గడిచిన రెండేళ్ల కాలంలో (2024 నుండి ఇప్పటివరకు) సుమారు 822 మంది మావోయిస్టులు 334 ఆయుధాలతో తెలంగాణ పోలీసుల ఎదుట మోకరిల్లారని, మన రాష్ట్రంలో లొంగిపోయిన ఒడిశాకు చెందిన మావోయిస్టులను ఇప్పటికే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించామని డీజీపీ వెల్లడించారు. అలాగే త్వరలోనే తెలంగాణకు చెందిన మావోయిస్టుల స్వగ్రామాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను స్వయంగా కలవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడైన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు జాడే రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) వంటి కీలక నేతలు తక్షణమే అజ్ఞాతాన్ని వీడి చట్టం ముందు లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. అలా లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల పునరావాస ప్రయోజనాలను, జీవనోపాధి సదుపాయాలను కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' గడువు ముగుస్తున్న నేపథ్యంలో భద్రతా దళాలు ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల్లో కూంబింగ్‌ను తీవ్రతరం చేయడంతో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారని లేదా లొంగిపోతున్నారని, ఫలితంగా దేశంలో మావోయిస్టుల ప్రాబల్యం దాదాపుగా క్షీణించిందని డీజీపీ వివరించారు.

## ఇరాన్‌కు డొనాల్డ్
# ట్రంప్ గట్టి హెచ్చరిక

ట్రంప్ ఈ విషయంలో మరింత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. ఇరాన్ సేకరించిన అత్యధిక నాణ్యత గల యురేనియంను వెంటనే అమెరికాకు అప్పగించాలని, లేదా అంతర్జాతీయ సంస్థల పర్యవేక్షణలో దానిని పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్' లో ట్రంప్ ఒక పోస్ట్ చేస్తూ, ఒకవేళ అమెరికాకు అప్పగించడం ఇష్టం లేకపోతే అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ కమిషన్ లేదా దానికి సమానమైన అధికారిక సంస్థల సమన్వయంతో, ఒక సురక్షిత ప్రాంతంలో ఆ యురేనియంను పూర్తిగా నాశనం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇరాన్ అణు సామర్థ్యం ప్రపంచ శాంతికి, ముఖ్యంగా అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని హెచ్చరించిన ట్రంప్, అవసరమైతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. మరోవైపు, ఇరాన్ ఈ ఒత్తిళ్లకు కొంతవరకు తలొగ్గినట్లు తెలుస్తోంది. తాము అణ్వాయుధాల తయారీ కోసం ప్రయత్నించడం లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవలే స్పష్టం చేయగా, తమ వద్ద నిల్వ ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందనే వార్తలు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోపక్క తీవ్రరూపం దాల్చాయి. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులకు తెగబడింది. ఈ దాడుల్లో భాగంగా దాదాపు 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను ఇజ్రాయెల్ వైమానిక దళం ధ్వంసం చేసింది. ఇందులో పది కమాండ్ సెంటర్లతో పాటు భారీగా ఆయుధ సంపత్తి కలిగిన డిపోలు కూడా ఉన్నట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఒకవైపు అణు చర్చల వేడి, మరోవైపు ఇజ్రాయెల్ దాడులతో మధ్యప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులు గందరగోళంగా మారాయి.

## ఎసిబి వలలో మరో అవినీతి చేప

### పదివేలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్ పట్టివేత

**జోగులాంబగద్వాల, మే26 :** ఎసిబి వలలో మరో అవినీతి చేప చిక్కింది. భూముల సర్వే చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటూ జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తన భూమిని సర్వే చేయాల్సిందిగా మండల సర్వేయర్ బ్రహ్మయ్యను బాధితుడు ఆశ్రయించగా రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా వ్యూహం మేరకు పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కోర్టుకు తరలించనున్నారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా వదిలేది లేదని అధికారులు హెచ్చరించారు.

## జనసేనాని పవన్‌పై వ్యాఖ్యలు

### ప్రొపెసర్ నాగేశ్వర రావు అరెస్ట్‌కు రంగం సిద్ధం

### డిజిపి ఆనందంను కలిసి రక్షణ కల్పించాలన్న నాగేశ్వర్

**హైదరాబాద్, మే26** జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ పోలీసులు అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఆంధ్రా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో నాగేశ్వర్ రావు ఇంటి వద్ద తెలంగాణ పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలో నాగేశ్వర్ రావు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. తనకు భద్రత కల్పించాలని డీజీపీని కోరారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో అరెస్ట్ చేయాలంటే ఇక్కడి పోలీసుల అనుమతి ఉండాలని, లేకపోతే అది అక్రమ అరెస్టుగా పరిగణించాల్సి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అరెస్టుకు అనుమతి ఇస్తారా లేక అరెస్టును అడ్డుకుంటారా అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ అరెస్ట్ చేసేందుకు వస్తే హైకోర్టులో అరెస్ట్ కాన్సిల్ చేసేందుకు రిట్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు ఉన్నట్లు సమాచారం.

## తూర్పుగోదావరి జిల్లాలో ఘోర ప్రమాదం

➢ **మొదటి పేజి తరువాయి ...** స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. మలిశాల గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి లేదా ఒకే బృందానికి చెందిన ఎనిమిది మంది వ్యక్తులు మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతానికి విహారయాత్ర (పిక్నిక్) నిమిత్తం వెళ్లారు. జగ్గంపేటకు చెందిన ఒక ట్రావెల్స్ సంస్థ నుండి కృష్ణ అనే వ్యక్తి ఒక ఇన్నోవా వాహనాన్ని సెల్ఫ్ డ్రైవింగ్ కోసం అద్దెకు తీసుకుని, తనతో పాటు మిగిలిన ఏడుగురిని ఎక్కించుకుని మారేడుమిల్లి వెళ్లారు. అయితే, ఏజెన్సీ ప్రాంతాన్ని సందర్శించి తిరిగి ప్రయాణమైన క్రమంలో.. కొత్తపల్లి శివారులోని జీడిపిక్కల ఫ్యాక్టరీ సమీపానికి వచ్చేసరికి వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు వాహనం బాగా దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న కొండిపూడి వివేక్ (19), బల్లిలా పద్మ (19) లతో పాటు మూడేళ్ల చిన్నారి గట్ల లక్కీ దుర్మరణం పాలయ్యారు. వాహనాన్ని నడుపుతున్న కృష్ణతో పాటు కందిగట్ల నాని, రామకృష్ణ దొర, దుర్గ, నవ్యలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

### యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం

### రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

**హైదరాబాద్, మే26 :** యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

### డిజిపిని కలిసి కోరినట్లు నాగేశ్వర్ వెల్లడి

**హైదరాబాద్, మే26 :** తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. తన వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పష్టం చేశారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏపీలో పలు చోట్ల కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో నాగేశ్వర్‌ను అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు తెలంగాణకు చేరుకున్నారంటూ ప్రచారం జరిగింది. దాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఇదంతా అసత్య ప్రచారమని స్పష్టం చేసింది.

# గ్రామ దీపికల డిమాండ్లను వెంటనే అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మెచ్చ
- గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి
- మండుటెండలో గ్రామ దీపికలు సమ్మె చేస్తుంటే...కాంగ్రెస్ నాయకులు ఏసీలో సేదతీరుతున్నారు
- వీఓఏలకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేల వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు
- గ్రామ దీపికల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ



జన సంఘర్షణ 26-5-2026

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట రింగు రోడ్డు వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న గ్రామ దీపికల వివో ఏ ఎస్ దీక్షా శిబిరాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బి.ఆర్. ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు బి.ఆర్. ఎస్ నాయకులతో కలిసి సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. గ్రామ దీపికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆవేదనను ఆయన అడిగి తెలుసుకుని అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వారు మాట్లాడుతూ.. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా గ్రామ దీపికలు న్యాయం కోసం దీక్షలు చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం ఏసీ గదుల్లో సేదతీరుతున్నారని మండిపడ్డారు. పాలకులకు మహిళల కష్టం, ఆవేదన కనబడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలు కన్నీరు పెట్టుకున్న రాజ్యం ఎప్పుడూ బాగుపడిన దాఖలాలు లేవని. గ్రామ దీపికలపై ప్రభుత్వం చిన్నచూపు మానుకోవాలి అని హెచ్చరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వీఓఏలకు న్యాయం జరిగిందని, అప్పట్లో రూ.3 వేలుగా ఉన్న గౌరవ వేతనాన్ని మాజీ సీఎం కేసీఆర్ గరూ.5 వేలుకు పెంచారని గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామ దీపికలపై పనిభారం పెరిగినా, తగిన గుర్తింపు లేదా వేతనం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో వీఓఏలకు నెలకు రూ.20 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని. గ్రామ దీపికల సమస్యలను పార్టీ అధినేత కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ,మాజీ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లి, పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ దీపికలందరికీ వెంటనే రూ.20 వేల వేతనం అమలు చేయాలని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కాసాని నాగ శేష పద్మ(చంద్ర మోహన్) వివో ఏలకోసం తెచ్చిన కొబ్బరి నీళ్ళు, భోజనం వారికి



అందజేశారు. ఈ కార్యక్రమంలో జూపల్లి రమణరావు, మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, ప్రకాశ్ రావు, కాసాని నాగ శేష పద్మ(చంద్ర మోహన్), కౌన్సిలర్ భూక్యా ఉదయ జ్యోతి(ప్రసాద్), జజ్జూరపు శ్రీరామ్ మూర్తి, సత్యవరపు సంపూర్ణ, నారం రాజ్ శేఖర్, జ్యోత్స్న, గోవింద్, జీవన్ రావు, తగరం జగన్నాథం, వేలేటి పార్వతి, అమీర్, రఫీ, చిప్పనపల్లి శ్రీను, చందా కుమార స్వామి, జక్కుల రాంబాబు,గంగాధర్, ఇస్లావత్ లక్ష్మీ, శివ తదితరులు ఉన్నారు.

## రైతును భయపెట్టొద్దు.. విజ్ఞానంతో మార్చాలి: పర్యావరణ వేత్త సతీష్ ఖండేల్వాల్

- నిప్పు పెట్టొద్దు.. మగ్గబెట్టండి: సాగు ఖర్చు తగ్గించుకునే అసలైన సూత్రం ఇదే
- ఆఫీసులకే పరిమితమా? రైతులకు అర్థమయ్యేలా చెప్పరా? అధికారులపై విమర్శలు
- ఎరువుల ఖర్చు సగానికి తగ్గేలా.. నేల తల్లిని కాపాడుకునే అద్భుత పద్ధతి
- శిక్షలతో కాదు.. అవగాహనతోనే వ్యవసాయ వికాసం

ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)

రైతును జరిమానాలతో భయపెట్టి సాధించేది ఏమీ లేదు.. సాగుపై సరైన విజ్ఞానాన్ని అందించి వారిలో మార్పు తీసుకువచ్చినప్పుడే నిజమైన వ్యవసాయ అభివృద్ధి సాధ్యమవుతుందని పర్యావరణ వేత్త, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ పిఎల్వి, సంఘసంస్కర్త డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల భూమి క్రమంగా బీడుగా మారుతున్న వైనాన్ని ఆయన ఎత్తిచూపారు. అధికారులు కేవలం ఏసీ గదులకే పరిమితం కాకుండా, నేరుగా గ్రామాల్లోకి వెళ్లి రైతులకు క్షేత్రస్థాయిలో వాస్తవాలను అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణానికే కాదు, స్వయంగా రైతుకే భారీ నష్టం వాటిల్లుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిప్పు పెట్టడం వల్ల భూమిలో ఉండే కోట్ల కొద్దీ మేలు చేసే సూక్ష్మజీవులు మాడిపోవడమే కాకుండా, నేలను గుల్లబరిచే వానపాములు చనిపోయి భూమి గట్టిపడిపోతుందని హెచ్చరించారు. దీనివల్ల రైతులకు ఎరువుల ఖర్చు మరో 30 శాతం అదనంగా పెరుగుతుందని, పెట్టుబడి పెరిగినా దిగుబడి మాత్రం దారుణంగా తగ్గిపోతుందనే చేదు



నిజాన్ని పాలకులు, అధికారులు రైతులకు వివరించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. వ్యర్థాలను కాల్చడం మానేసి, వాటిని భూమిలోనే మగ్గబెట్టి దున్నడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ సూచించారు. అలా కుళ్లిన గడ్డి మేలైన సేంద్రీయ ఎరువుగా మారుతుందని వివరించారు. దీనివల్ల నేలలో సూక్ష్మజీవులు, వానపాముల సంఖ్య పెరిగి భూమి మళ్లీ జీవకళను సంతరించుకుంటుంది. నీటిని పట్టి ఉంచే సామర్థ్యం పెరిగి, కరువు పరిస్థితుల్లో సైతం



పంట తట్టుకుని నిలబడుతుందని, తద్వారా రసాయన ఎరువుల ఖర్చు దాదాపు సగానికి తగ్గుతుందని ఆయన గణాంకాలతో సహా నిరూపించారు. అయితే, ప్రభుత్వాలు కేవలం ఆంక్షలు విధిస్తూ, చట్టాల పేరుతో రైతులను బెదిరించడం వంటి అనాలోచిత చర్యలకు దిగుతుండటం శోచనీయం. ఇలాంటి బెదిరింపు ధోరణి పక్కనబెట్టి, అసలైన పద్ధతిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. కనీసం ఒక్క రైతు చేనైనా ఎంపిక చేసి, ఈ ఆధునిక, పర్యావరణ అనుకూల పద్ధతిని ప్రత్యక్షంగా చూపిస్తే.. ఆ ఫలితాన్ని చూసి ఆ రైతే మరో పది మందికి చెప్పి ఊరంతటినీ మారుస్తాడని, ఈ దిశగా అధికార యంత్రాంగం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

## యాకయ్య నగర్ నిరుపేదలకు మౌలిక వసతులు కల్పించాలి: సిపిఎం డిమాండ్

ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పరిధిలోని సీఎస్‌పీ గ్రామపంచాయతీ దేవులపల్లి యాకయ్య నగర్‌లో నివసిస్తున్న నిరుపేదలకు తక్షణమే కనీస మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేసింది. గత ఎనిమిదేళ్లుగా ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పార్టీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందు తహసీల్దార్ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్డీఓ రామ్‌మోహన్, తహసీల్దార్ సూర్యనారాయణలకు నిరుపేదల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా నిరుపేదలు గుడిసెల్లో నానా అవస్థలు పడుతున్నా స్థానిక యంత్రాంగం కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు కాలయాపన చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెవెన్యూ సిబ్బందితో విచారణ జరిపించి, ముందస్తుగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుడిసె




వాసులను ఉద్దేశించి నాయకులు మాట్లాడారు. దశాబ్దాలుగా పేదల హక్కులు, గుడిసె వాసుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. అధికారులు కేవలం తాగునీటి హామీతో సరిపెట్టకుండా, యాకయ్య నగర్‌లోని నిరుపేదలందరికీ సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ప్రజాధర్నా, వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక నిరుపేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంతోష వెంకన్న, సుజాత, కోటమ్మ, గోబిరియా, హుస్సేన్, మంగ, వైకుంఠం, రహీమ్ పాషా, కౌసల్య తదితరులు పాల్గొని నిరుపేదల పోరాటానికి మద్దతుగా నిలిచారు.

## కనీస వేతనాల పెంపు అంతా మోసం.. కార్మికులకు తీరని నష్టం: ఐఎఫ్టీయూ

ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు భారీగా పెంచినట్లు చేస్తున్న ప్రచారం కేవలం అశాస్త్రీయమైన పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం ఇల్లందులోని ఐఎఫ్టీయూ కార్యాలయంలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి కేవలం కాగితాలకే పరిమితమైన తప్పుడు ప్రకటనలతో కోటి మందికి పైగా కార్మిక కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపినట్లు భ్రమలు కల్పిస్తున్నారని, నిజానికి ఈ కొత్త వేతనాల వల్ల కార్మికులకు లాభం లేకపోగా తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో అమలవుతున్న ప్రస్తుత వేతనాల కంటే ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు చాలా తక్కువగా ఉండటం ప్రభుత్వ అనాలోచిత వైఖరికి అద్దం పడుతోందని సీతారామయ్య గణాంకాలతో సహా ఎండగట్టారు. ప్రస్తుతం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. 14,456 నుండి రూ. 21,503 వరకు వస్తుండగా, ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోతో రూ. 450 నుండి రూ. 5,000 వరకు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ కార్మికులు కూడా ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయం వల్ల నెలకు రూ. 1,900 నుండి గరిష్టంగా రూ. 8,444 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కరువు భత్యాన్ని కలుపుతూ, అన్ని కార్మిక సంఘాలతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి కనీస వేతనాలను పునఃపరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి కార్మికులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, అధికారుల అధికారాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయబోమని మంత్రివర్గంలో తక్షణమే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ల వల్ల కార్మిక శాఖ కేవలం ఉత్సవ విగ్రహంగా మారిన తరుణంలో, కార్మిక శాఖ ద్వారా వేతనాలు అమలు చేయిస్తామని సీఎం, కార్మిక మంత్రి చెప్పడం కార్మికులను నట్టేట ముంచడమేనని విమర్శించారు. ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నేతలు తోడేటి నాగేశ్వరరావు, డి. ప్రసాద్, ఎన్. సంజీవ్, గౌని నాగేశ్వరరావు, యాసారపు వెంకన్న, గడ్డం నాగేష్ తదితరులు పాల్గొని కార్మికుల హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ..

- బాన్సువాడ బిజెపి ఇన్చార్జ్ ఎన్నారై శశాంక్

కోటగిరి/మే 26/(జన సంఘర్షణ)



కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటగిరి మండలం దేవునిగుట్ట తండా గ్రామంలో క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోటగిరి మండల కేంద్రంలోని దేవుని గుట్ట తండా ఏముల నవీన్ మాట్లాడుతూ.. కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతలో కి్రడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం, సీతారాం నాయక్, ఏముల నవీన్, పత్తి సతీష్ కప్ప సాయిలు హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వివోఏ ల రెండో రోజు చేరుకున్న నిరవధిక సమ్మె ...

కోటగిరి/మే 26/(జన సంఘర్షణ)




వివో ఏ లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి, సర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ వర్తింపు చేయాలి. అర్హులైన వివో వీళ్లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలి. వివో ఏ లకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం 20 లక్షలు వరకు కనిపించాలి. టాప్ నెట్వర్క్ సౌకర్యం కల్పించాలి. 58వ జీవోను సవరించాలని ఉమ్మడి మండలాల వివోఏ లు సమ్మెను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు శోభ, కార్యదర్శి , రాజు, కోశాధికారి రమేష్, సహకార దర్శి శిరీష, ఉమ్మడి మండలాల ఐకెపి సంఘం సహాయకులు పాల్గొన్నారు.

## ఏసీబీ కి చిక్కిన షామీర్పేట్ తహసిల్దార్ సుచరిత

- రెండు లక్షల రూపాయలు డ్రైవర్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ పట్టివేత

మేడ్చల్/మే 26/(జన సంఘర్షణ)



మగ అధికారులు లంచాలు తీసుకుంటే తామేమి తక్కువ అని మహిళా అధికారులు వారి పనితీరు లో అవినీతి చోటు కల్పిస్తున్నారు. నిన్న కాక మొన్న మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్లు ఏసీబీ అధికారులు పట్టుకున్నప్పటికీ అధికారులకు ఎలాంటి భయం కనిపించడం లేదు. ఏసిబి అధికారులు పట్టుకుంటే తిరిగి కేసులు కొట్టేసిన తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చి మళ్ళీ లంచాలకు ఎగబడుతున్నారు కొంతమంది అధికారులు. వారం రోజుల నుంచి ఏసీబీకి భారీ తిమ్మంగలాలు పట్టు పడుతుంటే మరొక పక్క మేడ్చల్ జిల్లా షామీర్పేట్ తహసిల్దార్ సుచరిత తన వాహనం డ్రైవర్ నుంచి రెండు లక్షల రూపాయల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు మంగళవారం. బాధితుల నుంచి డబ్బు తీసుకున్న డ్రైవర్ సుచరితకు ఇస్తుండగా ఎసిబి దాడి చేసి పట్టుకున్నారు. షామీర్పేట్ తాసిల్దార్ కార్యాలయంలో సోదాలు చేశారు. తహసిల్దార్ సుచరిత ను అదుపులోకి తీసుకున్నారు.

జన సంఘర్షణ

బుధవారం
27 మే 2026

# టాలీవుడ్ వేదికపై మెరిసిన ఇల్లందు కిరణం 'శ్యామ్ పొదిల'

- రాష్ట్ర రాజధాని వేదికపై సగర్వంగా నిలిచిన కొరియోగ్రాఫర్ శ్యామ్ పొదిల
- ఇల్లందు టు హైదరాబాద్: 'ప్లానెట్-డీ' అవార్డుల వేదికపై మెరిసిన శ్యామ్ పొదిల
- సింగరేణి కార్మికుడి కొడుకు సాధించిన అద్భుత విజయం.. ఇల్లందు ఖ్యాతిని చాటిన శ్యామ్ మాస్టర్
- 25 ఏళ్ల నృత్య తపస్సుకు దక్కిన గౌరవం.. శ్యామ్ పొదిలకు అరుదైన పురస్కారం
- బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో ద్వారా 50 మందిని మాస్టర్లుగా మార్చిన ఇల్లందు సంచలనం శ్యామ్
- సొంత ఊరి మిత్రుడి ప్రోత్సాహంతో వెండితెరకు.. నేడు ఇల్లందు కీర్తి కిరీటంగా మారిన శ్యామ్ పొదిల
- హంట్, జూలం, బొగ్గుట్ట చిత్రాలతో టాలీవుడ్‌ను ఊపేయనున్న ఇల్లందు నృత్య సామ్రాట్ శ్యామ్ పొదిల

ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)

**ప్లానెట్-డీ అవార్డుల వేదికపై మెరిసిన ఇల్లందు నృత్య కిరణం**

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక భాస్కర ఆడిటోరియం (బిర్లా ప్లానిటోరియం) నిన్న ఒక అద్భుతమైన ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది. ప్రముఖ 'ప్లానెట్-డీ' సంస్థ నిర్వహించిన పురస్కారాల మహోత్సవంలో టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ పొదిల శ్యామ్ సుందర్ (శ్యామ్ పొదిల)ను 'ఉత్తమ నృత్య దర్శకుడు' పురస్కారం వరించింది. ఎందరో సినీ ప్రముఖుల సమక్షంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.

**గద్దర్ అవార్డు గ్రహీతల చేతుల మీదుగా అత్యున్నత గౌరవం**

ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'గద్దర్ ఉత్తమ చిత్రం అవార్డు' గ్రహీతలు, 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్ర దర్శకులు కంపాటి సాయిలు, చిత్ర నిర్మాత వేణు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తెలుగు సినిమా సృజనాత్మకతకు ప్రతీకలుగా నిలిచిన ఈ ఇద్దరి చేతుల మీదుగా శ్యామ్ పొదిల ఈ ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డును అందుకోవడం విశేషం.

**అవార్డు వేదికపై భావోద్వేగానికి లోనైన శ్యామ్ పొదిల**

ఈ సందర్భంగా అవార్డు గ్రహీత శ్యామ్ పొదిల మాట్లాడుతూ.. "గద్దర్ అవార్డు గ్రహీతలైన కంపాటి సాయిలు, వేణు చేతుల మీదుగా ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డు తీసుకోవడం నా జీవితంలో మర్చిపోలేని మధుర క్షణం. నా 25 ఏళ్ల నృత్య సాధనకు దక్కిన గౌరవమిది. నా ప్రతిభను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించిన ప్లానెట్-డీ సంస్థకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

**సింగరేణి మట్టి నుంచి వచ్చిన అద్భుత ప్రతిభ**

ఈ అద్భుత విజయానికి పునాది ఎక్కడ పడిందో చూడాలంటే మనం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లందు పట్టణానికి వెళ్లాలి. పూర్తి పేరు శ్యామ్ సుందర్ పొదిల (అలియాస్ శ్యామ్ పొదిల) అయిన ఈ ప్రతిభావంతుడు ఇల్లందులోనే జన్మించారు. ఆయన తండ్రి వెంకటరమణ పొదిల మాజీ సింగరేణి ఉద్యోగి కాగా, తల్లి రాధ పొదిల. ఒక సామాన్య సింగరేణి కార్మికుడి ఇంట్లో పుట్టి, నేడు రాష్ట్ర రాజధాని వేదికపై ఇల్లందు పేరును సగర్వంగా నిలబెట్టారు శ్యామ్.

**గురువు సంపత్ రాజు పాదాల చెంత నృత్య శిక్షణ**

చిన్నప్పటి నుంచే నృత్యంపై ప్రాణమున్న శ్యామ్.. తన కలలను నిజం చేసుకునే క్రమంలో ప్రముఖ నృత్య గురువు సంపత్ రాజుని ఆశ్రయించారు. ఆయన దగ్గరే





నృత్యంలో ఓనమాలు, శాస్త్రీయ మెళకువలు, నృత్య రీతులను కూలంకషంగా నేర్చుకున్నారు. గురువు నేర్పిన క్రమశిక్షణ, నృత్య సాధనే తనను ఈ రోజు సినీ పరిశ్రమలో ఇంతటి వాడిని చేశాయని శ్యామ్ మాస్టర్ ఎప్పుడూ గర్వంగా చెబుతుంటారు.

**పావు శతాబ్దపు సుదీర్ఘ అనుభవం.. వేయికి పైగా ప్రదర్శనలు**

నృత్య రంగంలో శ్యామ్‌కి ఉన్న 25 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఒక పెద్ద గ్రంథం లాంటిది. రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 1000కి పైగా డాన్స్ షోలలో పాల్గొని తన నృత్య ప్రతిభతో స్టేజీల మీద దుమ్ములేపారు. ఆయా షోలలో ఆయన చేసిన అద్భుత ప్రదర్శనలు చూసి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో శ్యామ్ పేరు ఇరు రాష్ట్రాల్లో మారుమోగిపోయింది.

**బుల్లితెరపై ఈటీవీ 'ధమ్ రిథమ్' షో ద్వారా మొదటి బ్రేక్**




స్టేజ్ షోల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న శ్యామ్‌కు బుల్లితెర (టెలివిజన్) రంగానికి వెళ్లే అవకాశం వచ్చింది. 2004 నుంచి 2012 దాకా పలు ప్రముఖ టీవీ ఛానళ్లలో డాన్స్ ప్రోగ్రామ్స్ చేస్తూ బిజీగా గడిపారు. ఇందులో అత్యంత ముఖ్యమైనది.. ప్రముఖ వినోద ఛానల్ ఈటీవీ (జుం) లో ప్రసారమైన 'ధమ్ రిథమ్' డాన్స్ షో. ఈ షోలోనే శ్యామ్‌కు మొదటిసారి బుల్లితెరపై పెద్ద గుర్తింపు దక్కింది.

**ఇల్లందు మిత్రుడు.. దర్శకుడు నిక్షత్ ఇచ్చిన మొదటి సినీ అవకాశం**

బుల్లితెరపై సత్తా చాటిన తర్వాత శ్యామ్ దృష్టి వెండితెర వైపు మళ్లింది. అయితే గాడ్ ఫాదర్ లేని పరిశ్రమలో మొదటి అవకాశం రావడం అంత సులువు కాదు. అలాంటి సమయంలో శ్యామ్‌కు మొదటిగా సినీ పరిశ్రమలో కొరియోగ్రాఫర్‌గా లైఫ్ ఇచ్చిన వ్యక్తి.. ఇల్లందు నివాసి అయిన ప్రముఖ దర్శకుడు కం హీరో నిక్షత్ (అలియాస్ ముస్తఫా). సొంత ఊరి వాడైన శ్యామ్‌పై నమ్మకంతో నిక్షత్ ఇచ్చిన ఆ మొదటి అవకాశమే శ్యామ్ సినీ జీవితాన్ని మలుపు తిప్పింది.

**వెండితెరపై కొరియోగ్రాఫర్‌గా వరుస విజయాలు**

దర్శకుడు నిక్షత్ ఇచ్చిన ప్రోత్సాహంతో టాలీవుడ్‌లో నృత్య దర్శకుడిగా అడుగుపెట్టిన శ్యామ్, ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. 'లాడాయి', 'ప్రేముంటే చాలు', 'ఒక్కడితో మొదలై' వంటి సినిమాలకు కొరియోగ్రఫీ అందించి, తన వినూత్న స్టెప్పులతో మాస్, క్లాస్ ప్రేక్షకులను ఊపేశారు. ఈ సినిమాల సక్సెస్ ఆయనను టాలీవుడ్‌లో సత్తా ఉన్న కొరియోగ్రాఫర్‌గా నిలబెట్టింది.

**ఖమ్మం జిల్లా విద్యాసంస్థల్లో నృత్య సెన్సేషన్**

సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ శ్యామ్ తన సొంత జిల్లాను మరువలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రముఖ విద్యా సంస్థలు, డిగ్రీ కళాశాలలు, ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్వహించే ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలకు, వార్షికోత్సవాలకు శ్యామ్ నృత్య దర్శకుడిగా వ్యవహరించారు. అక్కడి ఎంతోమంది విద్యార్థులకు డాన్స్ నేర్పిస్తూ, యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు.

**23 ఏళ్ల 'బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో' ప్రస్థానం**

ఇక శ్యామ్ మాస్టర్ కెరీర్‌లో అత్యంత అద్భుతమైన ఘట్టం.. ఆయన స్థాపించిన 'బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో'. గత 23 సంవత్సరాలుగా సొంతంగా ఈ నృత్య శిక్షణాలయాన్ని నడుపుతూ, డాన్స్ అంటే ఇష్టమున్న ఎన్నో వేల మంది యువతీ యువకులకు, పేద విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇచ్చి వారి కలలను నిజం చేస్తూ వస్తున్నారు.

**యాభై మంది శిష్యులను డాన్స్ మాస్టర్లుగా తీర్చిదిద్దిన ఘనత**

కేవలం తానే ఒక్కడినే ఎదగడం కాకుండా, తనలాగే ఎందరో మాస్టర్లు కావాలని ఆశపడ్డారు శ్యామ్. అందుకే తన బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో ద్వారా సుమారు 50 మందిని అద్భుతమైన డాన్స్ మాస్టర్స్ (స్వతంత్ర కొరియోగ్రాఫర్లు)గా తీర్చిదిద్దారు. నేడు ఆ యాభై మంది కూడా సినీ, టీవీ రంగాల్లో నృత్య దర్శకులుగా రాణిస్తూ తమ గురువు పేరును నిలబెడుతున్నారు.

**ఈ ఏడాది చివర్లో విడుదలకు సిద్ధమైన క్రేజీ చిత్రాలు**

ప్రస్తుతం శ్యామ్ పొదిల టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ కొరియోగ్రాఫర్‌గా దూసుకుపోతున్నారు. ఆయన నృత్య దర్శకత్వంలో రాబోతున్న సరికొత్త చిత్రాలు 'హంట్', 'డిటెక్టివ్-డి', 'జూలం', 'బొగ్గుట్ట' ప్రస్తుతం షూటింగ్స్ పూర్తి చేసుకుంటున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాలన్నీ ఈ ఏడాది చివర్లో భారీ స్థాయిలో విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

**సరికొత్త రికార్డులతో ముగిసిన ప్లానెట్- డి అవార్డుల వేడుక**

నిన్న జరిగిన 'ప్లానెట్-డీ' అవార్డుల వేడుకలో పలువురు చిత్రసీమ ప్రముఖులు, సీనియర్ డాన్స్ మాస్టర్స్ పాల్గొని శ్యామ్ పొదిలను ఘనంగా సత్కరించారు. ఇల్లందు లాంటి ఒక చిన్న పట్టణం నుండి, సింగరేణి కార్మికుడి కొడుకుగా ప్రయాణం మొదలుపెట్టి, 25 ఏళ్ల కష్టంతో నేడు టాలీవుడ్ బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డు అందుకునే స్థాయికి ఎదిగిన శ్యామ్ పొదిల ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.

# 108 మంగళవారం నిజాంబాద్‌లో హాస్పిటల్ ఆఫీసులో ఘనంగా పైలెట్ డే ఘనంగా నిర్వహణ

కోటగిరి/మే 26/(జన సంఘర్షణ)




108 మంగళవారం నిజాంబాద్‌లో 108 ఆఫీసులో ఘనంగా పైలెట్ డే జరుపుకున్నారు. మంగళవారం 108 సిబ్బంది 108 సిబ్బందిని పైలెట్ డే సందర్భంగా 108 రథసారధిగా నడిపే డ్రైవర్ని పైలెట్ అని కూడా పిలుస్తారని దీని ద్వారా అంబులెన్సు, 108 రోగులను కంటికి రెప్పలా కాపాడే పైలెట్ గుర్తించి ఆయన సక్రమంగా 108 ని ఇన్ టైంలో తీసుకెళ్లడం వల్ల ప్రాణాలను కాపాడుకోగలుగుతారు. ఒక కుటుంబానికి పెద్దలు ఎంత అవసరమో అంబులెన్స్‌కి పైలెట్ కూడా అంతే అవసరం. ఎలాంటి ఎమర్జెన్సీ కేసెస్ వచ్చిన సకాలంలో హాస్పిటల్ కి చేర్చడం పైలెట్ కి కీలకమైన ఛాలెంజ్ లాగా ఉంటుంది. ఎలాంటి ఆలోచనలను లెక్కచేయకుండా ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ఎంచుకొని రోడ్డుపై ధైర్యంగా తీసుకెళ్లేవాడే పైలెట్ గుర్తిస్తారు. ఒక అంబులెన్స్‌కి ఒక టెక్నీషియన్ ఒక పైలెట్ ఎంత అవసరమో పైలెట్ డే సందర్భంగా పైలెట్ సేవలను గుర్తించి వారి సేవలను మర్చిపోలేని ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ పేర్కొన్నారు. పైలెట్ లేనిదే అంబులెన్స్ లేదని నిజామబాద్ ఎమర్జెన్సీ సూపర్వైజర్ స్వరాజ్ పేర్కొన్నారు. టెక్నీషియన్స్ అంబులెన్స్ కి పైలెట్ ఎంత అవసరమో వారి యొక్క ఉపయోగాలు గుర్తించి ఒక రోజును పైలట్‌గా సేవలను గుర్తించి పైలెట్ డే ను జరుపుకోవడం జరిగింది. వారి సేవలను మర్చిపోలేని ఒక అనుభూతి రథసారధి లాగా నడిపే పైలెట్‌ను ఒక దేవుడు లాగా గుర్తించి ప్రాణాలు రక్షించే పైలేటును ఒక దేవుడు లాగా భావించవచ్చని ప్రతి ఒక్క ఎమర్జెన్సీ కేసును సకాలంలో ఆసుపత్రికి చేర్చడంలో కీలకమైన పాత్ర పైలట్ ఉంటుందని వారి సేవలు గుర్తించి వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పైలట్ సంతోష్ రెడ్డి ఎమర్జెన్సీ టెక్నీషియన్స్ ఇద్దరు కూడా రెండు కళ్ళ జోడు లాగా పని చేస్తేనే అంబులెన్స్ అనేది నడుస్తుంది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడి నర్సయ్య గుణాలను విజయ్ చూశా: శివరాజ్


ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)



విజయ్ సి ఎం కావాలని తాను కోరుకున్నానని కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ అన్నారు. 'ఇల్లందు ఎక్స్ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కథ నన్ను ప్రేరేపించింది. నిజంగా ఇలా ఉండగలరా అని ఆశ్చర్యం వేసింది. నర్సయ్య గుణాలను విజయ్ చూశా. ఆయనలా ప్రజలతో మమేకమై, మార్పు తీసుకురాగల శక్తి విజయ్ ఉంది' అని ఇండియా టుడే ఇంటర్వ్యూలో చెప్పారు. నర్సయ్య బయోపిక్లో శివరాజ్ నటిస్తున్నారు. ఆయన నటించిన 'పెద్ది' జూన్ 4న విడుదలవనుంది.

# ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషితో రూ.3.50 కోట్ల గాంధారి స్టేడియం మంజూరు

ఎల్లారెడ్డి:మే 26( జన సంఘర్షణ)



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

YAT&C (Sports) Department – Request for sanction of Rs.3.50 Crores for construction of Mini Stadium at Gandhari (V&M), Kamareddy District during the financial year 2026-27 – Administrative Sanction Accorded - Orders - Issued.

YOUTH ADVANCEMENT, TOURISM & CULTURE (SPORTS) DEPARTMENT

G.O.Rt.No.151 Dated:22.05.2026
Read the following:

From the VC&MD, Sports Authority of Telangana, Hyderabad, Lr.No.SATG/Infra/120/Kamareddy/2017, Dt:22.12.2025 & 16.03.2026.

ORDER:

In the reference read above, the Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad has requested the Government to accord administrative sanction for an amount of Rs.3.50 Crores with additional budget under the Capital Head of Account 4202-03-102-25-04-530-531 towards construction of the Mini Stadium at Gandhari (V&M), Kamareddy District.

2. Government after careful examination of the request, hereby accord administrative sanction for an amount Rs.3.50 Crores (Rupees Three Crores and Fifty Lakhs only) from the available budget of B.E.2026-27 under the Capital Head of Account "4202-03-102-25-04-530-531" to the Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad towards construction of the Mini Stadium at Gandhari (V&M), Kamareddy District.

3. The Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad shall take further necessary action accordingly, subject to compliance with other procedures and rules in vogue.

4. This order issues with the concurrence of the Finance (EBS.I) Department vide their U.O. No. 3721346/145/EBS.I/A2/2026, Dated:20.04.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

JAYESH RANJAN
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad.
Copy to:
The P.S. to Hon'ble Minister for Sports & Youth Services.
The P.S. to Special Chief Secretary to Government, YAT&C (Sports) Department.
The Finance (EBS.I) Department.
SF/SCs.

//FORWARDED BY :: ORDER//
SECTION OFFICER

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగు పడింది. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవతో గాంధారి మండలంకు రూ.3.50 కోట్ల భారీ నిధులతో మినీ స్టేడియం మంజూరైంది. ఏళ్ల తరబడి గాంధారి ప్రజలు, యువత కలగా ఎదురుచూసిన స్టేడియం నిర్మాణం ఇప్పుడు నిజం కావడంతో మండల వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే మదన్ మోహన్ తీసుకున్న ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. గ్రామీణ ప్రాంత యువత కూడా జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకొని క్రీడా రంగ అభివృద్ధికి ఎమ్మెల్యే మదన్ మోహన్ నిరంతరం కృషి చేస్తున్నారని స్థానిక నాయకులు పేర్కొన్నారు. గాంధారి అభివృద్ధి కోసం ప్రతి అంశంలో ముందుండే నాయకుడిగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారని ప్రజలు కొనియాడుతున్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకునే నాయకుడు", "అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే ప్రజానాయకుడు" అంటూ మండల ప్రజలు ఎమ్మెల్యే మదన్ మోహన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. రూ.3.50 కోట్ల మినీ స్టేడియం మంజూరు గాంధారి చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నిజామాబాద్ వార్డు, ఉపసర్పంచ్ పదవికి రాజీనామా

రాంపూర్ :మే 26( జనసంఘర్షణ )



నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం రాంపూర్ గ్రామపంచాయతీ 6వ వార్డు సభ్యుడు, ఉప సర్పంచ్‌గా ఎన్నికైన సురేష్ తన పదవులకు రాజీనామా చేశారు వ్యక్తిగత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన గ్రామస్తులకు, సహచరులకు తెలిపారు ఆయన రాజీనామాతో గ్రామంలో చర్చనియాశీశంగా మారింది. ఈ మేరకు నవీపేట్ ఎంపీడీవోకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై పైఅధికారులు సమాచారం ఇస్తామన్నారు కాగా, ఈ పరిణామం గ్రామపంచాయతీ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్: భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ

- మైనర్లకు పెళ్లిళ్లు చేస్తే కఠిన చర్యలు: సీడీపీఓ జ్యోతి హెచ్చరిక
- ఆడపిల్లలకు యుక్తవయసు వచ్చాకే వివాహాలు చేయాలి: సర్పంచ్ పూణేం కృష్ణ పిలుపు
- బాల్య వివాహాలు జరిగితే '1098' కి సమాచారం ఇవ్వండి: సీడీపీఓ
- మానవ అక్రమ రవాణాపై యువత నిఘా పెట్టాలి: భద్రాచలం సెక్టార్ సమావేశం

భద్రాచలం మే 26 (జన సంఘర్షణ)

దుమ్మగూడెం ప్రాజెక్ట్ పరిధిలోని భద్రాచలం సెక్టార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ, సీడీపీఓ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూణేం కృష్ణ మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు దాటిన బాలికలందరూ తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని ఆయన స్పష్టం చేశారు. అలాగే, తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు యుక్త వయసు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలని సర్పంచ్ కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గ్రామాల్లోని చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారికి రక్తహీనత కలగకుండా న్యూట్రిషన్ ఫుడ్‌ను సక్రమంగా అందించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు సమయానుకూలంగా బాలామృతం అందజేయాలని సర్పంచ్ పేర్కొన్నారు. పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీలు నిరంతరం అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ స్థానికంగా దొరికే పౌష్టికాహారాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం సీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలలో ఇప్పటికీ ఎక్కువ శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని పూర్తిగా నిరోధించడానికి ఐసీడీఎస్ ప్రాజెక్టు తరుపున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. చట్టప్రకారం యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలని సీడీపీఓ స్పష్టం చేశారు. మైనారిటీ తీరకముందే పెళ్లిళ్లు జరిపిస్తే ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటుందని ఆమె హెచ్చరించారు. బాల్య వివాహాలు జరిపిస్తే కేవలం తల్లిదండ్రులపైనే కాకుండా,




పెళ్లి చేసిన పురోహితులకు, దానికి సహకరించిన గ్రామ పెద్దలపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని జ్యోతి స్పష్టం చేశారు. గ్రామాల్లో యువజన కార్యకర్తలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే '1098' టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. గ్రామాల్లో మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) జరగకుండా స్థానిక యువత ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని సీడీపీఓ పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న బాలికలందరి చేత ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు.

## రోడ్డు గురించి పట్టించుకునే నాధులు కరువయ్యారు


◆ **ఇలాగైతే ప్రమాదాలు జరగవా**



కోటగిరి, మే 26 ( జన సంఘర్షణ )
నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రం నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా మారిందని, ఇలాగైతే ప్రమాదాలు జరగవా, దీని గురించి పట్టించుకునే నాధులు కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి వెళ్లే మార్గంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం వద్ద పొతంగలకు వెళ్లి మార్గం అదేవిధంగా కొత్త పల్లి గ్రామానికి వెళ్లే మార్గం చాలా అద్వానంగా మారిందని దీనిపై దృష్టి పెట్టాలని, ప్రయాణికులు, వాహనపు దారుల రాకపోకలకు తీవ్ర అంతరం ఏర్పడుతుందని ఇప్పటికైనా దీనిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పాల్వంచలో అయోధ్య సైకిల్ యాత్రికుడు 'శేషమణి'కి ఘన స్వాగతం

◆ **శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి దర్శనం**



పాల్వంచ మే 26 (జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రామచంద్రాపురం (గుడిపాడు) గ్రామంలోని శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని అయోధ్య సైకిల్ యాత్రికుడు శేషమణి సందర్శించారు. అయోధ్య నుండి ప్రారంభమై ఏడాది పాటు సాగనున్న తన సుదీర్ఘ సైకిల్ యాత్రలో భాగంగా ఆయన ఈరోజు పాల్వంచ మండలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానికులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శేషమణి మోక్ష వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి ఆశీస్సులు అందించి, తీర్థప్రసాదాలను బహూకరించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గిరిజన సమాఖ్య (రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్, కోరేం రమేష్‌లు పాల్గొని, శేషమణిని ప్రత్యేకంగా అభినందించారు. యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ తరపున శేషమణిని శాలువాతో ఘనంగా సత్కరించి, చిరు జ్ఞాపికను అందజేశారు. దైవచింతనతో, సమాజ శ్రేయస్సు కోసం దేశవ్యాప్తంగా సాగుతున్న ఇటువంటి సైకిల్ యాత్రలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు కొనియాడారు.

## అశ్వరావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృత పర్యటన

◆ **మోటార్లు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ**



అశ్వరావుపేట మే 26 (జన సంఘర్షణ)
గిరిజన రైతులకు, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గిరిజనుల సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా మద్దులమడ గ్రామంలో నిర్వహించిన 'ప్రజా రచ్చబండ' (గ్రామసభ)లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల మధ్య కూర్చొని వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, గ్రామాల్లో మౌలిక వసతుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నల్లబడు గ్రామంలో గిరిజన పోడు రైతుల భూములకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిసిటీ లైన్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సాగునీటి ఇబ్బందులు కలగకుండా రైతులకు ఉచితంగా బోర్ మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికంగా గిరిజన విద్యార్థులు ప్రపంచంతో పోటీపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో, ఉన్నత విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను అందజేసినట్లు తెలిపారు. అటు ప్రజా సమస్యల పరిష్కారం, ఇటు రైతన్నలకు ఉచిత కరెంట్-బోర్ మోటార్లు, మరోవైపు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి కార్యక్రమాలతో గిరిజన జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు. ఈ అద్భుతమైన సంక్షేమ కార్యక్రమాలలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహూల్ ఐఏఎస్ , అశ్వరావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నశెట్టి సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, స్థానిక ఎంఆర్ఓ, ఎంపీఓ రామకోటి రెడ్డి, సర్పంచులు చిప్పల పందు రెడ్డి, సత్యం లక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

నిజాంబాద్ రూరల్. మే ( జన సంఘర్షణ )



నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ (ఎం )విలేజ్‌కు చెందిన ధారావత్ రవి (36) సంవత్సరాలు గత ఐదు రోజుల నుంచి ట్రాక్టర్ నడుతూ వడదెబ్బకు గురై చనిపోయినట్టు స్థానికులు తెలిపారు. వ్యవసాయ పనులు భాగంగా గత ఐదు రోజుల నుంచి ఏకధాటిగా ట్రాక్టర్ నడుపుతూ వడదెబ్బ బారిన పడడం జరిగిందని స్థానికులు తెలిపారు. వడదెబ్బకు గురై చనిపోయిన మృతుడు రవి పేద కుటుంబమని ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ

◆ **తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ అయిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి బాధితులు**

రుద్రూర్:మే 26( జన సంఘర్షణ)
రేవంత్ రెడ్డి కర్కోటక ముఖ్యమంత్రి. ఇది దుర్మార్గపు ప్రభుత్వం. ఆడబిడ్డల ఇళ్లను కూల్చుతూ వారికి మనశాంతి లేకుండా చేస్తున్నారు. వంద రూపాయల చీర ఇచ్చి వాళ్లను కోటీశ్వరులను చేశామంటూ సీఎం అబద్దాలు చెబుతున్నారు. వెలుగుమట్ల, పరిగి, ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాలని గవర్నర్ కు వినతిపత్రం ఇచ్చాం. రిపోర్ట్ తెప్పించుకొని న్యాయం చేస్తామని గవర్నర్ హామీ ఇచ్చారు వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి బాధితులతో పాటు విశారదన్ మహారాజ్ తో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ను కలిసిన కవిత .రేవంత్ రెడ్డి కర్కోటక ముఖ్యమంత్రి అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు ప్రభుత్వమని అన్నారు. ధర్మాసనాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేత బాధితులు, ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ బాధితులతో కలిసి మంగళవారం లోక్ భవన్ లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బాధితుల గోడు గవర్నర్‌కు వివరించారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేత, ట్రిపుల్ ఆర్అైన్మెంట్ మార్పు, రాయగిరిలో భూసేకరణ, కడ్లాపూర్ లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూసేకరణ కు చేస్తున్న ప్రయత్నాలను గవర్నర్ కు వివరించారు. గవర్నర్ తో భేటీ అనంతరం లోక్ భవన్ వద్ద తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల మీద తెలంగాణ రక్షణ సేన, ధర్మ సమాజ్ పార్టీ అనేక పోరాటాలు చేస్తోన్న విషయం మీకు తెలిసిందే. ఖమ్మంలోని వెలుగుమట్ల, పరిగిలోని ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ల్యాండ్ ఆక్విజేషన్, ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల కోసం పోరాడుతూ వచ్చాం. మా పోరాటం కారణంగా ఖమ్మంలోని వెలుగుమట్లలో బాధితులకు అదే చోట ల్యాండ్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది...పరిగి, ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ చేసే పనిని ఆపేసింది. ఇవ్వన్నీ కూడా మాకు పాక్షిక విజయాలు. పూర్తి స్థాయిలో విజయం సాధించాలంటే కేంద్ర ప్రభుత్వం ఇన్వాల్వ్ మెంట్ అవసరం ఉంది. అందుకే గవర్నర్ కలిసి వారికి ఈ అంశాలను వివరించటం జరిగింది. వీటన్నింటి మీద రిపోర్ట్ తెప్పించుకోని ఆయన సానుకూలంగా స్పందిస్తారని భావిస్తున్నాం...వెలుగుమట్ల, పరిగి, ట్రిపుల్ ఆర్ బాధితుల తరపున ఇద్దరిద్దరు రిప్రజేంటేషన్ ఇచ్చేందుకు వచ్చారు. అదే విధంగా టీఆర్ఎస్ నేతలు, ధర్మ సమాజ్ పార్టీ నేతలు కూడా వచ్చారు. మేమంతా కూడా గవర్నర్...భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని అడగటం జరిగింది. ఆయన మేము చెప్పిందంతా విని సానుకూలంగా స్పందించారు... కచ్చితంగా ప్రభుత్వం నుంచి రిపోర్ట్ తెప్పించుకొని న్యాయం చేసే ప్రయత్నం చేస్తానని గవర్నర్ చెప్పారు... ట్రిపుల్ ఆర్ కు సంబంధించి నాలుగు సార్లు అలైన్ మెంట్ మార్చిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్తే ఆశ్చర్యపోయారు. కిషన్ రెడ్డి ట్రిపుల్ ఆర్ కోసం ఇచ్చిన లెటర్ ను కూడా చూపించాం.



గవర్నర్ ద్వారా న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం. లేదంటే భవిష్యత్ లో ఉమ్మడి కార్యాచరణ ద్వారా పోరాటాలు చేస్తాం. వంద రూపాయల చీర ఇచ్చి ఆడవాళ్లను కోటీశ్వరులు చేస్తున్నామంటూ ఈ కర్కోటక ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నాడు. ఆడబిడ్డ అయిన నవ్య ఇళ్లను కూలగొట్టి వారికి మనశ్శాంతి లేకుండా చేశారు. వెలుగుమట్ల లో ఇళ్లు కూల్చుతుంటే ఓ మహిళకు గర్భస్రావం అయ్యింది. వాళ్ల భర్త రోదన ఇప్పటికీ మాకు వినబడుతూనే ఉంది. కల్లాలలో రైతుల ధాన్యం అలాగే ఉంది. ఈ ముఖ్యమంత్రి విమానంలో ఢిల్లీకి వెళ్తూ ఫ్లైట్ నుంచి చూస్తే ఆయనకు ఏమీ కనబడటం లేదేమో? రైతు లేకపోతే మనకు బుక్కెడు బువ్వ కూడా ఉండదు. ఏ జిల్లాలో చూసిన కల్లాల్లో ధాన్యం అలాగే ఉంది. ఒక్క రైతు కూడా సంతోషంగా లేదు. వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

# గోదావరి ఇసుక దందాపై సిబిఐ దర్యాప్తు జరపాలి

◆ **మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర డిమాండ్**

భద్రాచలం మే 26 (జన సంఘర్షణ)
రాష్ట్ర ప్రభుత్వ అండదండలతో గోదావరి పరివాహక ప్రాంతంలో భారీ ఎత్తున ఇసుక మాఫియా దందా సాగుతోందని జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు చందా లింగయ్య దొర తీవ్ర ఆరోపణలు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలలో అమల్లో ఉన్న 1/70 చట్టం మరియు పీసా చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఈ అక్రమ వ్యాపారం సాగుతోందని ఆయన మండిపడ్డారు. భద్రాచలం, ములుగు జిల్లాల పరిధిలోని గోదావరి నది నుండి సీతారామ ఇరిగేషన్ ప్రాజెక్టు, దుమ్ముగూడెం, వాజేడు-వెంకటాపురం ఇరువైపులా 'ఇసుక సిల్ట్' పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఆధునిక యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 74, ములుగు జిల్లాలోని 40 కలిపి మొత్తం 114 ఆదివాసి ఇసుక సొసైటీల ద్వారా ప్రతిరోజూ దాదాపు 5 లక్షల 70 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను బయటకు తీస్తున్నారని చందా లింగయ్య దొర వివరించారు.



వినియోగదారులకు ఒక క్యూబిక్ మీటర్ ఇసుకను రూ.1,800 చొప్పున విక్రయిస్తూ, రోజుకు రూ.102 కోట్ల 60 లక్షల రూపాయల మేర వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, స్థానిక ఆదివాసి సొసైటీలకు క్యూబిక్ మీటరుకు కేవలం రూ.30, మధ్య దళారీలకు రూ.30 మాత్రమే చెల్లిస్తూ, మిగిలిన రూ.1,740 ప్రభుత్వ ఖజానాకు చేరుతోందని ఆయన లెక్కలతో సహా వెల్లడించారు. ఏడాదిలో కేవలం ఆరు నెలల పాటు ఇసుక ర్యాంపులు నడిచినప్పటికీ.. రోజుకు రూ.99.18 కోట్ల నిఖరాదాయం చొప్పున, సంవత్సరానికి రూ.17,852 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కన గత 12 ఏళ్లలో (2014 నుండి 2026 వరకు) ఈ రెండు జిల్లాల నుంచే సుమారు రూ.2,14,228 కోట్ల (రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా) భారీ ఆదాయం సమకూరిందని చందా లింగయ్య దొర స్పష్టం చేశారు. పీసా చట్టం నిబంధనల ప్రకారం స్థానిక గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే ఈ భారీ సొమ్మును పూర్తిగా ఆయా స్థానిక ప్రాంతాల అభివృద్ధి కే ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆయన గుర్తుచేశారు. ఈ సుదీర్ఘ కాలంలో గిరిజన ప్రాంతాల నుంచి తరలిన ఇసుక సొమ్మును తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి, స్థానిక ఆదివాసి ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీసా, గిరిజన హక్కుల చట్టాల ఉల్లంఘనపై మరియు ఈ సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల ఇసుక దందాపై తక్షణమే కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. తద్వారా దోషులను కఠినంగా శిక్షించి, ఆదివాసుల హక్కులను, వారి సంస్కృతిని రక్షించాలని చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు.

# సింగరేణి జోలికొస్తే ఊరుకునేది లేదు-మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

- ◆ **ప్రైవేటీకరణపై పోరాటానికి సై అన్న బాణోతు హరిప్రియ నాయక్**
- ◆ **కోరం కనకయ్య కుటుంబ లబ్ధి వల్లే ఇల్లందుకు తీవ్ర అన్యాయం: మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మండిపాటు**
- ◆ **ఇల్లందు బొగ్గు వైభవాన్ని కాపాడింది కేసీఆర్ ప్రభుత్వమే: టీబీజీకేఎస్ సమావేశంలో హరిప్రియ నాయక్**
- ◆ **పూసపల్లి ఓసి వ్యయం పెరగడానికి కారణం కాంగ్రెస్ నాయకుల బినామీ భూములే: హరిప్రియ నాయక్**
- ◆ **ఎమ్మెల్యే కోరం కనకయ్య బినామీ దందాతోనే పూసపల్లి ఓసి నిర్మాణంలో జాప్యం: మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్**

ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)
వందల ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ జరగనివ్వబోమని ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాణోతు హరిప్రియ నాయక్ స్పష్టం చేశారు. బొగ్గు వైభవానికి నిలయమైన ఇల్లందు చరిత్రను కాపాడుకోవడం కోసం పూసపల్లి నూతన ఓపెన్ కాస్ట్ నిర్మాణానికి అడుగులు పడింది బీఆర్ఎస్ హయాంలోనేనని ఆమె గుర్తుచేశారు. ఈ నూతన ఓసి నిర్మాణానికి సాంకేతికంగా ఎటువంటి అడ్డంకులు లేవని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ అధ్యక్షులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో, యూనియన్ అధ్యక్షుడు మిరియాల రాజి రెడ్డి అధ్యక్షతన టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ ముఖ్య సమావేశానికి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ప్రత్యేకంగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లందు ప్రాంత ప్రాధాన్యతను, సింగరేణి ఉనికిని కాపాడుకోవడానికి గతంలో తాము చేసిన కృషిని వివరించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఓసి మూసివేతతో ఇల్లందు బొగ్గు గనుల చరిత్ర ముగిసిపోయే పరిస్థితి వచ్చిందని హరిప్రియ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తరుణంలో ఇల్లందు చరిత్రను, కార్మికుల భవిష్యత్తును కాపాడుకోవడం కోసం ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి, పూసపల్లి ఓసిని నూతన ప్రాజెక్టుగా ఏర్పాటు చేసే విధంగా పెద్ద ఎత్తున ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూసపల్లి నూతన ఓసి నిర్మాణానికి సంబంధించి పబ్లిక్ హియరింగ్ (ప్రజాభిప్రాయ సేకరణ), ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ (పర్యావరణ అనుమతులు) వంటి అన్ని రకాల ప్రక్రియలు విజయవంతంగా పూర్తయ్యాయని మాజీ ఎమ్మెల్యే గుర్తుచేశారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ, నేటికీ పూసపల్లి ఓసి ప్రారంభోత్సవ పనులు నత్తనడకన సాగడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. నూతన ఓసి ప్రపోజల్స్ వచ్చిన ముందు, ఆ తర్వాత కాలంలో విపరీతంగా బినామీ భూ నిర్వాసితుల సంఖ్యను పెంచడం వల్లే ఇక్కడ వివాదం మొదలైందని ఆమె వివరించారు. ఈ విధంగా కృత్రిమంగా లబ్ధిదారుల సంఖ్యను పెంచడం వల్ల నూతన ఓసి ప్రాజెక్టు నిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగిపోయిందని,



ఫలితంగానే పూసపల్లి నూతన ఓసి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే ఒక్క కుటుంబ స్వార్థ లబ్ధి వల్ల ఇల్లందు ప్రాంతం మొత్తం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన చెందారు. దేశానికి వెలుగులు అందించే సింగరేణి సంస్థకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని హరిప్రియ నాయక్ కొనియాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశంలో సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, కార్మిక కుటుంబాలకు అండగా నిలిచామని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో సింగరేణి కార్మికుల హక్కులను కాపాడుకుంటూనే, కేసీఆర్ గారి హయాంలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన యువ కార్మికులంతా చురుకైన పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. యువ కార్మికుల సంపూర్ణ సహకారంతో, అందరం అంకితభావంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ని ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా ముందుకు సాగాలని హరిప్రియ నాయక్ సూచించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
27 మే 2026

# బక్రీద్ పండుగ.. గొర్రెల, మేకల అమ్మకందారులూ తస్మాత్ జాగ్రత్త!!

◆ **హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ సూచన**



హైదరాబాద్/మే 26/(జన సంఘర్షణ)
బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో నగరంలోని గొర్రెలు, మేకల సంతలు కొనుగోలుదారుల రద్దీతో సందడిగా మారాయి. అయితే, ఇదే అదనుగా భావిస్తున్న కొందరు కేటుగాళ్లు డిజిటల్ చెల్లింపుల పేరిట అమాయక వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు తెగబడుతున్నారు అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సూచించారు. ముఖ్యంగా ఫేక్ ఫోన్ పే వంటి నకిలీ మొబైల్ అప్లికేషన్లను సృష్టించి, నగదు చెల్లించినట్లుగా స్క్రీన్‌పై చూపిస్తూ వ్యాపారులను నమ్మిస్తున్నారు. సంతల్లో ఉండే విపరీతమైన హడావుడిని ఆసరాగా చేసుకుని, తమ బ్యాంక్ ఖాతాల్లోకి నిజంగానే నగదు జమ అయ్యిందో లేదో సరిచూసుకోని వ్యాపారులకు ఈ కేటుగాళ్లు టోకరా వేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ కమిషనరేట్ కంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి రెండు మోసాలు వెలుగులోకి వచ్చాయి. కంచన్‌బాగ్ ప్రాంతంలో ఆరుగురు వ్యక్తులు మూడు బైక్‌లపై వచ్చి, ఒక వ్యాపారితో బేరం కుదుర్చుకుని రూ. 68 వేలు చెల్లించినట్లు నకిలీ యాప్ ద్వారా స్క్రీన్ చూపించి జీవాలను తీసుకెళ్లిపోయారు. అదేవిధంగా రాజేంద్రనగర్‌లోనూ నలుగురు వ్యక్తులు రూ. 48 వేల విలువైన గొర్రెలను కొనుగోలు చేసి, ఇదే తరహాలో నకిలీ పేమెంట్ యాప్‌తో మోసగించారు. బాధితులు ఆలస్యంగా తమ బ్యాంక్ ఖాతాలను తనిఖీ చేసుకోగా, పైసలు జమ కాలేదని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో గొర్రెలు, మేకల విక్రయదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా నగదు పంపినప్పుడు, కేవలం కొనుగోలుదారుడి ఫోన్‌లో కనిపించే స్క్రీన్ షాట్‌ను లేదా పేమెంట్ సక్సెస్ అనే మెసేజ్‌ను చూసి నమ్మవద్దు. మీ స్వంత మొబైల్‌కు వచ్చే బ్యాంక్ అధికారిక ఎస్ఎంఎస్ చూసుకోండి లేదా నేరుగా మీ బ్యాంకింగ్ యాప్ తెరిచి బ్యాలెన్స్ పెరిగిందో లేదో స్వయంగా నిర్ధారించుకున్న తర్వాతే జీవాలను అప్పగించండి. వీలైనంత వరకు పెద్ద మొత్తంలో లావాదేవీలు చేసేటప్పుడు నగదు రూపంలో తీసుకోవడమే ఉత్తమంఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా లేదా మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నించినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డయల్ 100 కు కాల్ చేయండి లేదా మా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

# గుంటూరు క్యాంపు గ్రామంలో సర్పంచ్ కొడుకే పెత్తనం కొనసాగిస్తున్నారు

◆ **ప్రభుత్వ జాగా కబ్జాచేస్తున్న వార్డు మెంబర్**



వర్ని , మే 26 ( జన సంఘర్షణ )
నిజామాబాద్ జిల్లా వర్ని మండలం గుంటూరు క్యాంపు గ్రామంలో గ్రామ సర్పంచ్ కుమారుడు సర్వం తానే అంటూ వ్యవహరిస్తున్నాడని తండ్రి స్థానంలో కొడుకు పెత్తనం కొనసాగిస్తున్నారని గుంటూరు క్యాప్ గ్రామానికి చెందిన రైతు అదేవిధంగా నాయకులు గంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా వర్ని ఎమ్మార్వో కార్యాల మీదట నిరసన చేసి వినతి పత్రాన్ని ఎమ్మార్వో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడిమల్ గ్రామ శివారు ప్రాంతంలో ఎకరం నర భూమి కొనుగోలు చేస్తే పానాది ఉన్న ప్రభుత్వ భూమిని వాట్సాప్ చూడు కబ్జా చేసుకున్నారని ఈ వాట్సప్ కి సర్పంచ్ కొడుకు సపోర్ట్ చేస్తున్నారని అదేమిటని ప్రశ్నించడానికి పోతే తన భార్యపై దాడి చేయడంతో వర్ణి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటూ ఇష్టానుసారంగా వివరిస్తున్న వార్డు సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. తనకు న్యాయం జరిగేంత వరకు తన ఉద్యమం ఆగబోదని గ్రామంలో సర్పంచ్ కొడుకు పెత్తనం కొనసాగిస్తున్నారని ఆ పెత్తనం కొనసాగించకుండా ప్రజల పక్షాన న్యాయంగా పనిచేసే విధంగా అధికారులు చూడాలని ఆయన కోరడం జరిగింది. గ్రామ సర్పంచ్ తన ఇంటి ఎదుట ఉన్న ప్రభుత్వ బావిని పూడ్చుకొని ఆ స్థలాన్ని కూడా కబ్జా చేసుకోవడం ఎంతవరకు సమంజసం అని గంగాధర్ ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచును ఫోన్ల వివరణ కోరగా తన కుమారుడు ఎలాంటి పెత్తనం కొనసాగించడం లేదని తనకు ఇంగ్లీషు రాకపోవడంతో తన కుమారుడు తనకు సహకారంగా ఉంటాడు అని అన్నారు. కొంతమంది భూకబ్జాలు చేసుకుంటూ తమపై నిరాదన ఆరోపణలు చేస్తున్నారని ఇది ముమ్మాటికి అవాస్తవమని ఫోన్లో సమాధానం ఇవ్వడం జరిగింది.

# జుక్కల్ ఎమ్మెల్యేకు ఎస్కార్ట్ తొలగింపు

◆ **చాలా సంతోషంగా ఉంది.. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు**

కామారెడ్డి /మే26/(జన సంఘర్షణ)
ఇటీవల బాన్స్వాడలో జరిగిన సమావేశంలో జూకల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పోలీసుల పనితీరుపై ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. పోలీసులు ఒక మాఫియాగా మారారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఒక పేదోడు ట్రాక్టర్లో ఇంటికి కోసం ఇసుక తీసుకువెళ్తే పోలీసులు పట్టుకొని వారికి వాహనాలు సి జె సి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. తన కళ్ళముంది మహారాష్ట్ర కు చెందిన ఇసుక మాఫియా ట్రాక్టర్ల నిండా ఇసుక తరలించబోతుంటే ఈ విషయాన్ని తాను లొకేషన్ తో సహా పోలీసులకు సమాచారం అందిస్తే వారు వీడియో గేమ్స్ ఆడుకుంటూ కాలక్షేపం చేశారని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆరోపించారు. ఈ విషయంపై ఆయన మంగళవారం స్పందించారు. పోలీసులు అంటే తనకు సంపూర్ణంగా గౌరవం ఉంది. కానీ ఎవరి విధులు వారు నిర్వహించుకుంటే నియోజకవర్గాలు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఈ సందర్భంగా తోట లక్ష్మీకాంతరావు వెల్లడించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఎస్కార్ట్ తొలగించడం పై ఆయన స్పందించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యేకు ఎస్కార్ట్ తొలగించకుండా తనకే ఎస్కార్ట్ కామారెడ్డి పోలీసులు తొలగించడం చాలా సంతోషంగా ఉందని తనకు అధికారులు, పోలీసులు తో పనిలేదు కానీ తాను జూకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి వచ్చానే తప్ప ఆస్తులు కూడా పెట్టుకోవడానికి రాలేదని ప్రజలకు సేవ చేసి వారి మన్ననలు పొందాలని ఉద్దేశమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వెల్లడించారు. తనకు నియోజకవర్గ ప్రజలు వారి నాకు అండ, వారే నాకు ఎస్కార్ట్ అంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. కామారెడ్డి పోలీసులు తనకు





ఎస్కార్ట్ తొలగించడం పట్ల ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సంతోషం వ్యక్తం చేశారు. తాను వద్దు అనుకున్న కామారెడ్డి పోలీసులు తనకు ఎస్కార్ట్ తొలగించడం తనకు ఎలాంటి ఇబ్బంది లేదని. జూకల్ నియోజకవర్గ ప్రజలు తనకు అండదండలు ఉన్నన్ని రోజులు వారికి సేవ చేసుకోవడమే నా కర్తవ్యం అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

# బాన్సువాడ ఎల్లయ్య చెరువులో రాత్రిపూట అక్రమాత్రవకాలు...

◆ **చోద్యం చేస్తున్న ఇరిగేషన్, రెవిన్యూ శాఖలు**

బాన్స్వాడ ప్రతినిధి /మే26/(జన సంఘర్షణ)
బాన్స్వాడ నియోజకవర్గంలో ఒకవైపు ప్రకృతిని విచ్ఛిన్నం చేస్తున్న మాఫియా ఇప్పుడు చెరువులపై పడ్డారు. చెరువు మట్టికి మంచి డిమాండ్ ఉండడంతో మట్టి మాఫియా పెద్ద ఎత్తున జెసిబి , టిప్పర్లు పెట్టి భారీ ఎత్తున చెరువు మట్టిని దోసకపోతున్నారు. వాస్తవానికి చెరువులో మట్టి తీయడం రైతులకు ఎంతో మేలు చేసినట్లు అవుతుంది. కానీ ఈ చెరువు మట్టి వ్యవసాయ పొలాల్లో ఉచితంగా వేయాల్సి ఉండగా కొంతమంది మట్టి మాఫియా తమ తాతలు ఆస్తి అన్నట్లు చెరువులపై పడి ఇష్ట రాజ్యాంగ మట్టిని ఇటుక బట్టీలకు, వెంచర్లకు తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. ముఖ్యంగా బాన్సువాడ ఎల్లయ్య చెరువులో మట్టి మాఫియా చెల్లరేగిపోతుంది. అధికారం మాది, అధికారి మా పనికి అడ్డు వస్తారు అన్న ధీమతో అధికార పార్టీకి చెందిన కొంతమంది చోటామోటా నాయకులు జెసిబి లు పెట్టి చెరువు మట్టి వెంచర్లకు, ఇటుక బట్టీలకు సరఫరా దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. ఎల్లయ్య చెరువులో మట్టి తీయడానికి ప్రభుత్వ అనుమతి లేదు అని ఒక వైపు అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, మంగళవారం నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఎల్లయ్య చెరువులో మట్టి త్రవ్వకాలు జరిపారు. దర్జాగా జెసిబిలు, టిప్పర్లు పెట్టి ఇటుక బట్టిలకు అమ్ముకుంటున్నారు. దీనిని అడ్డుకట్ట వేయాల్సిన రెవిన్యూ శాఖ, మున్సిపల్ శాఖ, ఇరిగేషన్ శాఖ నిమ్మక్ నీలెత్తినట్లు వివరించడంతో దర్జాగా ఎల్లయ్య చెరువులో మట్టి త్రవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా త్రవ్వకాలు జరుపుతున్నారు. భవిష్యత్తులో ఈ






నీటి లోతు తెలియక ప్రజలకు ముంచుకొచ్చే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారం ఉన్నప్పుడే ఎంతో కొంత సంపాదించుకోవాలన్నా లక్ష్యంతో కొంతమంది అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు చెరువులపై పడుతున్నారు. ఒకవైపు నిజామాబాద్ జిల్లా రుద్రూర్, కామారెడ్డి జిల్లా బీర్కూర్, బాన్స్వాడ ఎల్లయ్య చెరువులో అక్రమ మట్టి త్రవ్వకాలు జరుపుతున్నారు. వాస్తవానికి చెరువులో మట్టికి తవ్వాలంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తు పెట్టుకోవాలి, దరఖాస్తు పరిశీలించి ఇరిగేషన్ శాఖకు పంపిస్తారు. ఇరిగేషన్ శాఖ చెందిన ఏ ఈ చెరువు వద్దకు వచ్చి చెరువులో ఎంత స్థాయిలో మట్టి తీయాలి అన్నది క్షుణ్ణంగా పరిశీలించి ఎంత లోతు తవ్వాలి, ఇన్ని క్యూబిక్ మీటర్ల మట్టి తరలించుకో పోవాలి దానికి సంబంధించిన డీడీలు కట్టితే ఇరిగేషన్ శాఖ చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతిస్తారు. ఈ నిబంధనలోని పక్కనపెట్టి అధికారులు మంచిగా చేసుకొని ఎల్లయ్య చెరువులోని మట్టిని సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు త్రవ్వకాలు జరిపారు. ఇదంతా అధికారుల కన్ను సన్నుల్లో సాగుతుంది. అధికారులతో పాటు అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతల అండ దండలు ఉండడంతో ఎల్లయ్య చెరువులో మట్టి మాఫియా చెల్లరేగిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని రైతుల కోరుతున్నారు.

# రెండు రాష్ట్రాల నృత్య పోటీల బ్రోచర్ ఆవిష్కరణ




ఇల్లందు మే 26 (జన సంఘర్షణ)
హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి నృత్య పోటీల బ్రోచర్‌ను తెలుగు ఫిలిం కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత, తెలంగాణ డాన్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాస్టర్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఇల్లందుకు చెందిన వెంకట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి డాన్స్ కాంపిటీషన్ వేదికగా జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక కళాకారులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.గ్రామీణ ప్రాంతాల్లో సరైన గుర్తింపునకు నోచుకోని అపారమైన ప్రతిభ దాగి ఉందని, అలాంటి యువ కళాకారులను వెలికితీసేందుకు ఇటువంటి వేదికలు ఎంతో అవసరమని సుమలత ఈ సందర్భంగా పేర్కొన్నారు. సాధారణంగా నగరాలకే పరిమితమయ్యే ఇటువంటి పెద్ద పోటీలను, గ్రామీణ నేపథ్యం ఉన్న అకాడమీ ముందుకు వచ్చి నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతలోని సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్న వెంకట్ డాన్స్ అకాడమీ నిర్వాహకుల సేవలను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రతిభావంతులైన డ్యాన్సర్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారిని జాతీయ స్థాయికి పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ పోటీలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు అకాడమీ నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రతిభ ఉన్నా ఆర్థిక స్తోమత లేక వెనుకబడిపోతున్న వారికి ఈ వేదిక ఒక సువర్ణావకాశం కానుంది.కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ మాస్టర్, ప్రముఖ డాన్స్ మాస్టర్లు కడారి వెంకటేష్, శేఖర్, సాయి, అరుణ్, రమేష్ మాస్టర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కళాకారులు, నృత్య అభిమానులు పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రాల వ్యాప్తంగా త్వరలోనే ప్రారంభం కానున్న ఈ పోటీల వివరాలను, రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వాహకులు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

# బక్రీద్ నేపథ్యంలో భద్రాచలంలో పోలీసుల హై అలర్ట్

◆ **విస్తృతంగా వాహనాల తనిఖీలు**



భద్రాచలం మే 26 (జన సంఘర్షణ)
రాబోయే పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని భద్రాచలం పట్టణంలో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా పట్టణ వ్యాప్తంగా కీలక ప్రాంతాలలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, టౌన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ ప్రత్యేక తనిఖీలలో పాల్గొన్నారు. భద్రాచలం సరిహద్దు ప్రాంతమైన గోదావరి బ్రిడ్జి సెంటర్ చెక్‌పోస్ట్, పట్టణ నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ సెంటర్, చర్ల రోడ్డుతో పాటు అంతరాష్ట్ర సరిహద్దులకు వెళ్లే ప్రధాన రహదారులపై అదనపు సిబ్బందిని మోహరించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను పూర్తిగా అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు. దాంతో పాటు ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా, మరియు ఏజెన్సీ నుంచి తరలిపోయే నిషేధిత గంజాయి రవాణాను పూర్తిగా అడ్డుకోవడమే లక్ష్యంగా 'విజిబుల్ పోలీసింగ్' లో భాగంగా ఈ ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్ట నిబంధనలను ఉల్లంఘించే వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ గారు ఈ సందర్భంగా గట్టిగా హెచ్చరించారు. పట్టణంలో ఎక్కడైనా కొత్త వ్యక్తులు సంచరించినా, లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా ఆ సమాచారాన్ని స్థానిక ప్రజలు వెంటనే పోలీసులకు అందించి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# లింగపల్లి గ్రామాన్ని బాల్య వివాహ నిషేధిత గ్రామంగా గుర్తింపు




సదాశివనగర్ మండలం లింగంపల్లి, మే 26 (జన సంఘర్షణ) :
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ స్రవంతి పాల్గొని, గ్రామ సర్పంచ్ టేక్రియాల లావణ్య రమేష్ అధ్యక్షతన లింగంపల్లి గ్రామాన్ని బాల్య వివాహ నిషేధిత గ్రామంగా అధికారికంగా ప్రకటించారు. అనంతరం గ్రామ బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి, గ్రామ పరిధిలో బాలల హక్కులను పరిరక్షిస్తూ బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
ఈ సందర్భంగా ఇన్స్‌పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐ.ఎస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు సోలంకి రవళి మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాలల హక్కుల పరిరక్షణకు సమాజం సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడ్ల గంగారం, వార్డు సభ్యులు శ్రీకాంత్, గంగయ్య, జ్యోతి, సౌమ్య, పద్మ, నందకుమార్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సంఘం అధ్యక్షురాలు, మహిళా సంఘం సభ్యులు, స్నేహ గ్రూప్ కిశోర బాలికలు, మహిళలు, కుల సంఘ పెద్దలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

**పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పర్స వెంకటేశ్వరరావు**



**అన్నపురెడ్డిపల్లి :**
అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ లోని బుచ్చన్న గూడెం లో రాచకొండ రాంబాబు, సైదమ్మ, దంపతుల కొత్త ఇంటి గృహప్రవేశ వేడుక ఆనందోత్సాహాలతో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పర్స వెంకట్, ముఖ్య అతిథిగా హాజరై, దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోంఁడ్రు సృజన, , వైస్ సర్పంచ్ గాలం కాటం రాజు, మండల నాయకులు వీరబోయిన నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు కాలం రాంబాబు, అలాగే పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే, అభిమానులు పాల్గొని వేడుకను మరింత ఉత్సాహంగా మార్చారు.

## వాసు గౌడ్ ఇంట్లో ఘనంగా ఎల్లమ్మ కళ్యాణం

**-హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్ :**
బీఆర్ఎస్ పార్టీ మాజీ మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వాసు గౌడ్ ఇంట్లో నిర్వహించిన ఎల్లమ్మ కళ్యాణం కార్యక్రమం ఘనంగా జరిగిం ది. ఈ వేడుకకు ఉప్పల్ ఎమ్మె ల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాటలే తప్ప హామీల అమలు లేదు...

**విఓల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి....**

**నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా.**



**అశ్వరావుపేట :**
అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వి ఓ లు వారి సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మెకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు,బి ఆర్ ఎస్ పార్టీ తరుపున మద్దతు తెలిపారు. వారికి మజ్జిగ ప్యాకెట్లు నిమ్మ సోడాను అందజేశారు. ఆవేదనను సమస్యలను విన్నారు. వారికి అండగా పార్టీ నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మానవీయ కోణంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, 3000 నుంచి 5000 లకు పెంచారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని గాలికి వదిలేశారాని మండిపడ్డారు. ఈ రెండేండ్లలో విపరీతమైన పని చేయించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని చిన్న చూపు చూడడం సరికాదని. వెంటనే వల్ల డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్,

# జిహెచ్ఎంసి కార్మికులను పర్మినెంట్ చేయాలి

**-జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**-జూన్ 8న మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ హెడ్ ఆఫీస్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి - సీఐటీయూ నాయకులు**





**ఉప్పల్ :**
జిహెచ్ఎంసి కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జూన్ 8న మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ హెడ్ ఆఫీస్, తార్నాక వద్ద నిర్వహించనున్న భారీ ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉప్పల్ కళ్యాణపురి ప్రాంతంలో జిహెచ్ఎంసి కార్మికుల సమావేశం నిర్వహించి ధర్నా ఏర్పాట్లపై చర్చిం చారు. ఈ సమావేశంలో సీఐటీయూ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే,వెంకన్న,సీఐటీయూ నాయకుడు పి రాజు మాట్లాడుతూ జిహెచ్ఎంసి కార్మికులు ఎన్నో సంవత్స రాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనాలు, అనిశ్చిత ఉద్యోగ పరిస్థితు లు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వంటి సమస్యలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జిహెచ్ఎంసి కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస హక్కులు, సామాజిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు, సరైన వేతనాలు కల్పించాలని కోరారు. జూన్ 8న తార్నాకలోని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ హెడ్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని కార్మికుల ఐక్యతను చాటాలని, తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కార్మికులు, సీఐటీయూ నాయకులు,స్థానిక కార్మిక ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గో టు విలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**-మాదిగ యువత ఎస్సీ వర్గీకరణ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి**

**-గ్రామీణ యువతకు ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తుంది : బండారి సురేందర్ మాదిగ,గద్దల సుకుమార్ మాదిగ**



**ధర్మసాగర్ :**
పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న "గో టు విలేజ్" కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో విజయవంతం చేయాలని, ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించిన అవకాశాలను మాదిగ యువత పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. సామాజిక చైతన్యం, విద్యా పురోగతి, యువత సాధికారత లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధర్మసాగర్ మండలంలోని రాపకపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు పులిపాక చిరంజీవి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన గద్దె నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగలు స్థానిక సర్పంచ్ కందుకూరి జయేందర్తో కలిసి సంప్రదాయబద్ధంగా ముగ్గు వేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనేది ఎన్నో దశాబ్దాల పోరాట ఫలితమని, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నిరంతర ఉద్యమాలు, ప్రజా చైతన్యంతోనే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. ఇప్పుడు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం యువత బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని సూచించారు. చదువు మధ్యలో ఆపివేసిన విద్యార్థులు తిరిగి విద్యాభ్యాసం కొనసాగించాలని, ఉన్నత విద్యతో జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. చదువుకోవాలనే తపన, అభిరుచి ఉన్న మాదిగ యువతకు ఎమ్మార్పీఎస్ అన్ని విధాలుగా అండగా నిలబడి మార్గనిర్దేశం చేస్తుందని హామీ ఇచ్చారు. యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే గో టు విలేజ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే గ్రామాల్లో సామాజిక చైతన్యం పెంచడం, యువతను ఉద్యమ భావజాలంతో ముందుకు నడిపించడం, విద్యా మరియు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి, ధర్మసాగర్ మండల ఇన్చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇమ్మడి సురేష్, కందుకూరి కరుణాకర్ మాదిగ, కందుకూరి శ్యామ్సుందర్ మాదిగ, ఇమ్మడి ఉప్పలయ్య మాదిగ, ఇమ్మడి కరుణాకర్ మాదిగ, వస్కుల దేవరాజ్ మాదిగ, కందుకూరి కరణ్ మాదిగ, కందుకూరి మల్లేశం మాదిగతో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం....

- **కూనంనేని సహకారంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడతాం......**
- **ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత...**
- **12వ డివిజన్లో తాగునీటి సమస్యలు పునరావృతం కాకుండా ఒకేదఫా మూడు బోర్లు మంజూరు......**
- **ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం..**
- **ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తాం**
- **కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సేవ చేయడమే ఏకైక ధ్యేయం**
- **కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**





**కొత్తగూడెం :**
కార్పొరేషన్ ప్రజలకు తాగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం కల్పించే దిశగా కీలక చర్యలు కొనసాగుతున్నాయని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని 12వ డివిజన్ భగత్సింగ్నగర్లో మంగళవారం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన మూడు నూతన బోర్లను మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవస రమైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నామని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ముఖ్యంగా 12వ డివిజన్, భగత్సింగ్నగర్ ప్రజలకు తాగునీటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అలాగే తాము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజాసేవే తమ ధ్యేయమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని వివరిం చారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, నాయకులు భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ నాగలక్ష్మి, 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నరసింహారావు, 49వ డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్, 12వ డివిజన్ భగత్సింగ్నగర్ ప్రజలు, కొత్తగూడెం కార్పొరేషన్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ గారిని అరెస్ట్ చేయడానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం

**ప్రజాస్వామ్య హక్కులపై దాడులు ఆపాలి -- తెలంగాణ రాష్ట్ర పోలీస్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి**

**ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర**

**ఉప్పల్ /ప్రజావారధి:**
ప్రజా సమస్యలపై నిరంతరం తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ విధానాలను విశ్లేషిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్ గారిని అరెస్ట్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు బలగాలు హైదరాబాద్కు రావడం అత్యంత ఆందోళనకర పరిణామమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తోందన్నారు, ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచడం రాజ్యాంగం కల్పించిన హక్కు. అలాంటి హక్కులను అణచివేయడానికి ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం యంత్రాంగాన్ని వినియోగించడం ప్రమాదకర ధోరణి అని అన్నారు. విమర్శించే స్వరాలను బెదిరించడం, అరెస్టుల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు . తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చి ఏపీ పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోందని, ఇలాంటి సందర్భాల్లో తెలంగాణ రాష్ట్ర పోలీసులు రాజ్యాంగబద్ధమైన విధానాలను పాటిస్తూ, రాష్ట్ర హక్కులను కాపాడుతూ వ్యవహరించాలన్నారు. స్థానిక పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా, చట్టపరమైన విధానాలను పూర్తిగా అనుసరించకుండా చేపట్టే చర్యలు సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ గారిపై వేధింపులను వెంటనే నిలిపివేయాలని,

## బ్రహ్మపురి కాలనీలో నూతన రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన నెమలి అనిల్ కుమార్




**ఉప్పల్ :**
ఉప్పల్ నియోజకవర్గంలోని శక్తిసా యినగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలో జరుగుతున్న నూతన రోడ్ల నిర్మాణ పనులను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయ కులు నెమలి అనిల్ కుమార్ గారు, శక్తిసాయినగర్ డివిజన్ ఏఈ స్పందనతో కలిసి పరిశీలించారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ఆశీర్వాదాలు అందిస్తున్నారని అన్నారు.అలాగే ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతోనే కాలనీలో ఈ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొంటూ కాలనీ వాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాదా శంకర్ గౌడ్, అన్వర్,శ్రీనివాస్, బాలరాజు,లక్ష్మయ్య,ఐలయ్య, విజయ్ రెడ్డి,బాబూ భాయ్, భాస్కర్, నరేందర్ రెడ్డి,సొహైల్,కాలనీ మహిళలు మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పశువుల రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

**:- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**రామగుండం,మే 26 :**
బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల జోన్,మం దమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను రామ గుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధి కారులు,సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు ఇచ్చి వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీ లించారు.సీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరి కట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి,విధుల్లో ఉన్న సిబ్బం దికి పలు సూచనలు చేశారు.ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,వాహనాలు మరియు పశువుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని,సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉం చాలని,అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.విధి నిర్వహణలో అప్ర మత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు.పండుగ సమయంలో శాంతి భద్రతలను కాపా డేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు**

**కరీంనగర్, మే26** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు.

# కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరం

- బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి
- వీధి కుక్కల నివారణకు అధికారులు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి
- ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే.సాబీర్ పాషా





**కొత్తగూడెం :**
కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరమని, బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీ, చాటివారిగూడెం గ్రామపంచాయతీకి చెందిన మారె రాములమ్మ (50) అనే మహిళ కుక్కకాటుతో మృతి చెందగా, మంగళవారం ఆమె భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగిపోయిందని, కుక్కకాటు వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాములమ్మ మృతి పట్ల తన గాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కోణంనేని సాంబశివరావు మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కాగా నివాళులర్పించిన వారిలో జ్యోతిబసు, పిచ్చయ్య, మిరియాల రాము, లక్ష్మయ్య, జాన్సన్, క్రాంతి, రాజేష్ కళ్యాణ్ జ్ఞానముత్యం తదితరులు ఉన్నారు.

# ఉప్పల్ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి రూ.80 లక్షలకు పైగా నిధులు మంజూరు

**పరమేశ్వర్ రెడ్డి చొరవతో ప్రారంభమైన అభివృద్ధి పనులు**

**యువత,క్రీడాకారులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం : ఇర్షాద్ ఖాన్**

**ఉప్పల్ :**
ఉప్పల్ మున్సిపల్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంల అభివృద్ధికి రూ.80 లక్షలకు పైగా నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు వేగంగా ప్రారంభమయ్యాయని బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) తెలిపారు. ప్రజలు, యువత మరియు క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే ఈ అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో నెలకొన్న సమస్యలపై స్థానిక ప్రజలు, యువత మరియు క్రీడాకారుల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో వాటిని ప్రజల తరఫున పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఇర్షాద్ ఖాన్ వెల్లడించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పరమేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి స్టేడియం అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారని చెప్పారు.ఈ క్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉప్పల్ మున్సిపల్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంల అభివృద్ధి పనుల కోసం రూ.80 లక్షలకు పైగా నిధులు మంజూరు చేయడం హర్షణీయమని తెలిపారు. ప్రస్తుతం పనులు వేగంగా ప్రారంభమై కొనసాగుతున్నాయని, పనులు పూర్తయిన అనంతరం యువత మరియు క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. అధికార యంత్రాంగం సమన్వయంతో స్పందించడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు.అలాగే ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిపై పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నాయకుడని ఇర్షాద్ ఖాన్ కొనియాడారు.ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను పరిష్కరించడం మా బాధ్యత. యువత భవిష్యత్తు, క్రీడాకారుల సౌకర్యాల మెరుగుదల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. పరమేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ నియోజకవర్గంలో మరిన్ని



అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని ఇర్షాద్ ఖాన్ స్పష్టం చేశారు.స్టేడియం అభివృద్ధి పనులు పూర్తయ్యాక స్థానిక యువతకు క్రీడల్లో మరింత ప్రోత్సాహం లభించడమే కాకుండా, క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# నారాయణపేట జిల్లా ను బాల్య వివాహ రహిత జిల్లా గా మార్చే లక్ష్యం తో ముందడుగు

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**

**నారాయణపేట, మే 25 :**
99 రోజుల కార్యాచరణ ప్రణాళిక , మహిళా వారోత్సవాలలో (25/05/2026 to 30/05/2026) భాగంగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో " బాల్య వివాహరహిత తెలంగాణ" అంశంలో భాగంగా నారాయణపేట జిల్లా ను బాల్య వివాహ రహిత జిల్లా గా మార్చే లక్ష్యం తో జిల్లా బాలల సంరక్షణ విభాగం మంగళ వారం దామరగిద్ద మండలం కంసాన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు.

**కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ....**

చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే ఆరోగ్యపరమైన మరియు సామాజికపరంగా వచ్చే సమస్యలు వాటి వల్ల ఎదుర్కొనే ప్రమాదాలపై అదేవిధంగా మరియు చట్ట పరంగా వచ్చే సమస్యల గురించి అనగా బాల్యవివాహాల నిరోధక



చట్టం ,బాలలపై జరిగే లైంగిక దోపిడీ నుంచి రక్షణ చట్టాల గురించి, బాల్య వివాహాలకు పాల్పడినటువంటి లేదా ప్రోత్సహించినటువంటి వారిపై చట్టపరంగా తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం గురించి బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి బాలిక వాళ్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా చదువుకోవాలని జీవితంలో ఆర్థిక స్థిరత్వం సాధించడం వల్లనే ఏదైనా సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ చదువు కొనసాగించడంపై దృష్టి పెట్టి వారికంటూ ఒక గుర్తింపు ఉండేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కాగా ఈ కార్యక్రమం "బాల్యవివాహం-బతుకు ఆగం" అనే థీమ్ తో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ శివారెడ్డి, గ్రామ సర్పంచ్ , డీ ఆర్ డి ఓ వెంకట్ రాములు, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, ,దామరగిద్ద తహసిల్దార్, ఎంపీడీవో, మద్దూరు , సిడిపిఓలు, అంగన్వాడి సూపర్వైజర్స్ , డీ సీ పీ యూ, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co